# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## **ప్రాంతీయ వార్తలు**

**తేది : 01-10-2025** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు విజయనగరం జిల్లాలో నిర్వహించే పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటారు.**

2. **తెలంగాణ స్థానిక సంస్థల ఎన్నికల్లో జడ్పీటీసీ స్థానాలకు అభ్యర్థుల జాబితాలను రూపొందించాలని మంత్రులు, డీసీసీ అధ్యక్షులకు ముఖ్యమంత్రి ఏ రేవంత్‌రెడ్డి సూచించారు.**

3. **సాంప్రదాయ కళలను భవిష్యత్తు తరాలకు అందించేందుకు "విజయవాడ ఉత్సవ్" వంటి వేడుకలు అవసరమని కేంద్రమంత్రి భూపతి రాజు శ్రీనివాస వర్మ పేర్కొన్నారు.**

4. **దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఇంద్రకీలాద్రిపై కొలువైన శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారు ఈరోజు మహిషాసుర మర్ధినిగా భక్తులకు దర్శనమిస్తున్నారు.**

=========================

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు విజయనగరం జిల్లాలో పర్యటిస్తారు. పర్యటనలో భాగంగా జిల్లాలోని గజపతినగరం నియోజకవర్గం దత్తి గ్రామంలో జరిగే ఎన్‌టిఆర్ భరోసా సామాజిక పింఛన్ల పంపిణీని ప్రారంభిస్తారు. లబ్ధిదారుల ఇంటికి వెళ్లి వారి సమస్యలను అడిగి తెలుసుకుంటారు. అనంతరం ఏర్పాటు చేసిన ప్రజావేదికలో ప్రసంగిస్తారు. ఈమేరకు ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించి అన్ని ఏర్పాట్లు చేశామని అధికారులు తెలిపారు.

-------------------------

ఆంధ్రప్రదేశ్‌ను లాజిస్టిక్స్‌కు కేంద్రంగా చేయాలన్నదే ప్రభుత్వం లక్ష్యమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. ఢిల్లీలో గత సాయంత్రం జరిగిన భారత పరిశ్రమల సమాఖ్య –సీఐఐ భాగస్వామ్య సదస్సు కర్టెన్ రైజర్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. 2026 జనవరి నాటికి రాజధాని అమరావతిలో క్వాంటం కంప్యూటింగ్ ప్రారంభమవుతుందని చెప్పారు. విశాఖపట్నంలో జరిగే భాగస్వామ్య సదస్సుకు పారిశ్రామిక వేత్తలు రావాలని ముఖ్యమంత్రి కోరుతూ,

వాయిస్ ..33 సెకన్లు

-------------------------

తెలంగాణ స్థానిక సంస్థల ఎన్నికల్లో జడ్పీటీసీ స్థానాలకు అభ్యర్థుల జాబితాలను ఈ నెల 5వ తేదీ నాటికి ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ–పీసీసీకి పంపాలని మంత్రులు, జిల్లా కాంగ్రెస్ కమిటీ–డీసీసీ అధ్యక్షులకు ముఖ్యమంత్రి ఏ. రేవంత్‌రెడ్డి సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికలపై హైదరాబాద్ నుంచి దృశ్య మాధ్యమ విధానంలో మంత్రులు, జిల్లా కాంగ్రెస్ కమిటీ నాయకులతో ముఖ్యమంత్రి నిన్న సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ, అన్ని జిల్లాల్లో పార్లమెంట్ సభ్యులు, శాసన సభ్యులు, ఎమ్మెల్సీలు, ముఖ్య నాయకులతో సంప్రదించి ప్రతి జడ్పీటీసీ స్థానానికి ముగ్గురు చొప్పున అర్హులైన అభ్యర్థులను గుర్తించాలని స్పష్టం చేశారు.

-----------------------------

సాంప్రదాయ కళలను భవిష్యత్తు తరాలకు అందించేందుకు “విజయవాడ ఉత్సవ్” వంటి వేడుకలు దోహదపడతాయని కేంద్రమంత్రి భూపతి రాజు శ్రీనివాస వర్మ పేర్కొన్నారు. విజయవాడ పున్నమి ఘాట్‌లో జరుగుతున్న “విజయవాడ ఉత్సవ్” వేడుకలలో కేంద్ర మంత్రి నిన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,

..వాయిస్...20 సెకన్లు

-----------------------------

దసరా శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా ఈరోజు మహర్నవమిని పురస్కరించుకొని ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువైన శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారు మహిషాసుర మర్ధినిగా భక్తులకు దర్శనమిస్తున్నారు. అలాగే శ్రీశైలంలో జరుగుతున్న దసరా మహోత్సవాలలో భాగంగా గత రాత్రి శ్రీ భ్రమరాంబికాదేవి సిద్ధిదాయిని అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

-----------------------------

ప్రజాసేవ, సుపరిపాలనకు ప్రాధాన్యమిస్తూ ప్రధానమంత్రి నరేంద్రమోదీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా మార్చేందుకు కృషి చేస్తోంది. “సేవా పర్వ్” పేరుతో ఆకాశవాణి విజయవాడ ప్రాంతీయ వార్తా విభాగం ప్రత్యేక కథనాలను అందిస్తోంది. ఇందులో భాగంగా కేంద్రప్రభుత్వం అమలు చేస్తున్న కిసాన్ సమ్మాన్ నిధి పథకం గురించి ఈ రోజు తెలుసుకుందాం.

వాయిస్ ఓవర్ ( 1.50 సెకన్లు )

-----------------------------

వస్తుసేవల పన్ను- జీఎస్టీ సంస్కరణలు ఆర్థిక సాధికారతకు ఎంతో దోహదం చేస్తాయని విజయవాడ తూర్పు శాసన సభ్యులు గద్దె రామ్మోహన్ తెలిపారు. జీఎస్టీ సంస్కరణలు–2.0 ద్వారా ప్రజలకు కలిగే ప్రయోజనాలను వివరిస్తూ జీఎస్టీ ఆధ్వర్యంలో ముద్రించిన కరపత్రాలను విజయవాడలో ఆయన నిన్న ఆవిష్కరించారు. అనంతరం గద్దె రామ్మోహన్ మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న జీఎస్టీ–2.0 సంస్కరణల వల్ల ప్రజలపై పన్నుల భారం తగ్గి నగదు ఆదా అవుతుందని చెప్పారు. రోజు వారి ఉపయోగించే వస్తువులపై జీఎస్టీని తగ్గించడం వల్ల కొనుగోళ్లు పెరుగుతాయని తెలిపారు.

-----------------------------

తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా భూదేవి సమేత శ్రీమలయప్పస్వామివారి

ఉత్సవమూర్తులకు నిన్న స్నపన తిరుమంజనం నిర్వహించారు. గత రాత్రి చంద్రప్రభ వాహనంపై స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. ఉత్సవాల్లో భాగంగా ఈ ఉదయం రథోత్సవం జరగనుంది.

---------------------------

మహిళల వన్డే క్రికెట్ ప్రపంచ కప్‌లో భాగంగా నిన్న అసోంలోని గువహటి వేదికగా శ్రీలంక, భారత్ జట్ల మధ్య తొలి మ్యాచ్ జరిగింది. తొలుత టాస్ గెలిచిన శ్రీలంక బౌలింగ్ ఎంచుకోవడంతో బ్యాటింగ్‌కు దిగిన భారత్ వర్షం కారణంగా కుదించిన 47 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 269 పరుగులు సాధించింది. అనంతరం బ్యాటింగ్ చేసిన శ్రీలంక 45.5 ఓవర్లలో 211 పరుగులు చేయడంతో 59 పరుగుల తేడాతో భారత్ విజయం సాధించింది.

---------------------------

పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడిందని, రేపటికి ఇది వాయుగుండంగా బలపడుతుందని అమరావతి వాతావరణ కేంద్రం వెల్లడించింది. దీని ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లో ఈరోజు, రేపు మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతారవరణ శాఖ అధికారి జి.లక్ష్మి తెలియజేస్తూ,

..వాయిస్.. 27 సెకన్లు

తెలంగాణలోనూ ఈరోజు, రేపు మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది.

---------------------------

వృద్ధుల సంక్షేమాన్ని కాంక్షిస్తూ ఈ రోజు అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం నిర్వహిస్తున్నారు. ఆరోగ్య ..., మానసిక పరంగా వృద్ధులను సంరక్షించవలసిన అవసరాన్ని తెలియజేస్తూ ఈ కార్యక్రమం జరుగుతోంది. 1984 సంవత్సరంలో ఆస్ట్రియా రాజధాని వియన్నాలో వృద్ధుల సమస్యలపై అంతర్జాతీయ సదస్సు జరిగింది. ఐక్య రాజ్య సమితి పిలుపు మేరకు 1991వ సంవత్సరం అక్టోబర్ ఒకటవ తేదీన అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం నిర్వహించారు. అప్పటి నుండి ప్రతి ఏటా ఈ కార్యక్రమం జరుగుతోంది.

=====================